హర్యానా గిట్టుబాటు ధరకోసం రైతాంగ ఆందోళన

హర్యానా రాష్ట్ర రైతులు మరోసారి భారీసంఖ్యలో రోడ్లపైకొచ్చారు. తాము పండించిన పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర పెంచాలని డిమాండ్‌చేస్తూ 2023 జూన్ రెండో వారంలో రోజుల తరబడి ఆందోళన చేశారు. ఢిల్లీ–చండీఘడ్ జాతీయ రహదారిని జూన్ 12న దిగ్బంధం చేశారు. దీనిలో పంజాబ్, ఉత్తరప్రదేశ్ రైతులు కూడా పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు పంటకు ప్రభుత్వం ప్రకటించిన క్వింటా 6,400 రూ।ల కనీస మద్దతు ధరకు కురుక్షేత్ర జిల్లాలోని పిప్లీ వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులెవరూ కొనుగోలు చేయటంలేదు. దీనితో రైతాంగం ఆగ్రహించి, ఆందోళనకు దిగారు. ఆందోళనకారులపై పోలీసులు తీవ్రంగా లాఠీఛార్జీ చేశారు. అనేకమందిని అరెస్ట్‌చేసి కేసు బనాయించారు. కనీస మద్దతుధర కోసం ప్రత్యేక చట్టం చేయాలన్న డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం అంగీకరించలేదు. ప్రభుత్వం ప్రకటించిన ధరకంటే తక్కువకు పంటను కొనుగోలు చేసే వ్యాపారులపై చర్యలేమీ తీసుకోకుండా, రైతుల నష్టం పూడ్చటానికి ప్రతి క్వింటాకు వెయ్యి రూపాయలు చొప్పున ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. అయినా రైతులకు గిట్టుబాటు కాకపోవటంతో వారంతా ఉద్యమబాట పట్టారు.

★★★★★